

తహశీల్దార్‌కు గోపవరం గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

గోపవరం మీదుగా 30 ఏళ్లకు పైగా ఒఎన్‌జిసి సంస్థ చమురు, సహజవాయువు తరలిస్తు గోపవరం గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని గ్రామస్తులు బుధవారం తహశీల్దార్ జె.వెంకటేశ్వరి కి వినతి పత్రం అందజేశారు. వారం రోజుల్లోపు ఒఎన్‌జిసి అధికారులు నుంచి సిసి రోడ్డు,డ్రైన్ నిర్మాణం ప్రారంభించి ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అనేదానిపై గ్రామస్తులకు అధికారుల సమక్షంలో హామీ ఇవ్వాలని లేని పక్షంలో ఒఎన్‌జిసి వాహనాలను గ్రామం మీదుగా వెళ్లకుండా అడ్డుకుంటామని తహశీల్దార్ కు తెలిపారు. సమస్యను ఒఎన్‌జిసి అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని తహశీల్దార్ తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గ్రామస్తులు కుంచే బాబులు, ఆకుల శ్రీను,పెమ్మిరెడ్డి సురేష్, తదితరులు ఉన్నారు.

వైసిపి అరాచకాలను ఎండగట్టాలి

- టిడిపి అధినేత చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి- గోకవరం, జగ్గంపేట

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి అరాచకాలను ఎండగట్టాలని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. తొలుత మధురపూడి విమానాశ్రయం నుంచి ఆయన గోకవరం, కోరుకొండ మీదుగా జగ్గంపేట చేరుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమము రావడం లేదని, ఉన్న పరిశ్రమలు మూత పడుతున్నాయని చెప్పారు. ఉద్యోగులకు నెలవారీ జీతాలు ఇవ్వడం గగనమైపోతోందన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరిగాయని నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. పట్టబద్ధులైన పలువురు ఉపాధి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వానికి విక్రయించినప్పటికీ సొమ్ములు రావడం జాప్యం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన తమదేన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పాలన్నారు. జగన్‌ను ప్రజలు ఇంటికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాజమండ్రి రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి, మాజీ ఎంఎల్‌ఎలు పెందుర్తి వెంకటేష్, వంతల రాజేశ్వరి, జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ తదితర నాయకులు పాల్గొన్నారు. తొలుత మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. సిఎం జగన్ ప్రజలకు రూ.10 ఇస్తే రూ.50 దోచుకుంటున్నాడన్నారు. జగన్‌ను ప్రజలు ఇంటికి పంపించాలన్నారు.రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపించాలని చంద్రబాబు పిలుపు ఇచ్చారు. జగ్గంపేటలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. తొలుత జగ్గంపేట మండలంలోని మల్లిశాల గ్రామంలో ఆయనకు వేలాది మంది కార్యకర్తలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి వెన్నుదన్నుగా ఉన్న యువతకు ఒక ఉద్యోగం కూడా లేకుండా చేసిన జగన్‌కు ప్రజలు ఓటు వేయకుండా టిడిపి అండగా నిలవాలన్నారు. పురుషోత్తమపట్నం స్టేజ్ 1, 2 లను నిర్మించి 35 టిఎంసిల నీటిని ఏలేరు జలాశయానికి అందించిన ఘనత తమదేనన్నారు. ప్రతి ఉద్యోగి మెడపై కత్తి పెట్టి పనులు చేయించుకుంటున్నారు అన్నారు. 2020లో పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితమిచ్చే సమయంలో రాష్ట్రానికి సైకోలా జగన్ అడ్డు తగులాడన్నారు. రీటెండర్ల సమస్యను తీసుకువచ్చి పోలవరం పనులు పూర్తవ్వకుండా తనకు నచ్చిన వారికి కాంట్రాక్టర్లు ఇచ్చారన్నారు. టిడిపి హయాంలో భూముల విలువ ఆకాశాన్నంటితే జగన్ పాలనలో దిగజారిపోయాయని చెప్పారు. అవసరానికి ఒక ఒక జిఒ ఇస్తూ కాలం వెళ్ళదీస్తున్నారన్నారు. బహిరంగ సభలను ఏర్పాటు చేసి పాలన యొక్క పనితీరును ప్రజలకు వివరిస్తుంటే తనకు ఎక్కడ అన్యాయం జరుగుతుందోనని సభలను రద్దు చేసే పనిలో పడ్డాడన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో తెలుగుదేశాన్ని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడే ప్రతి మాటను దష్టిలో పెట్టుకొని ముందుకు నడవాలని ప్రజలకు సూచించారు. సభ అనంతరం మాజీ జెడ్‌పి ఛైర్మన్ జ్యోతుల నవీన్ గృహంలో చంద్రబాబు రాత్రి బస చేయనున్నారు. గురువారం ఉదయం జగ్గంపేటలో 2,640 మంది కార్యకర్తలతో సమావేశం జరుగునున్నట్టు నెహ్రూ తెలిపారు.

జగ్గంపేట చంద్రబాబు రోడ్డుషోలో పాల్గొన్న జన సందోహం. (ఇన్‌సెట్‌లో) కోరుకొండలో చంద్రబాబుకు గజమాలతో స్వాగతం చెబుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబుకు ఘనస్వాగతం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడురోజుల పర్యటనకు వచ్చిన చంద్రబాబు నాయుడుకు మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు చంద్రబాబు రోడ్డుమార్గంలో బయల్దేరారు. కోరుకొండలో గజమాలతో కార్యకర్తలు స్వాగతం పలికి నాగలి, కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. చంద్రబాబు ప్రజలకు అభివాదం చేస్తూ గోకవరం బయలుదేరి వెళ్లారు. జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్, యనమల రామకష్ణుడు, చిక్కాల రామచంద్రరావు, నిమ్మల రామానాయుడు, చిల్లా జగదీశ్వరి, ఆదిరెడ్డి వాసు, పెందుర్తి వెంకటేష్ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు

బాబు సభలో దొంగల చేతివాటం

గోకవరంలో చంద్రబాబు సభలో పలువురు జేబుల్లో పర్సులు గల్లంతయ్యాయి. గోకవరం దేవీ3చౌక్ సెంటర్లో ఏర్పాటైన రోడ్డు షోలో జేబు దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. సభలోకి ప్రవేశించి పలువురు జేబుల్లోని పర్సులను అపహరించారు. గోకవరం కొత్తపల్లిలో ఏడుగురు, రాజవొమ్మంగికి చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద నుండి సుమారు రూ.రెండు లక్షల విలువైన సెల్ ఫోన్‌లు అపహరించారు. బాధితులు గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ శివ నాగబాబు తెలిపారు.

చంద్రబాబు పర్యటనలో పాల్గొన్న హరీష్

అమలాపురం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జగ్గంపేట తదితర నియోజకవర్గాలలో పర్యటన సందర్భంగా జిల్లాకు విచ్చేసిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుకి మధురపూడి విమానాశ్రయంలో అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం టిడిపి ఇంఛార్జ్ జియం హరీష్ బాలయోగి స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబుతోపాటు పర్యటన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అమలాపురానికి చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

16న శాసనమండలి ఎన్నికలకు నోటిఫికేషన్

- డిఆర్ఒ శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో శాసనమండలి ఎన్నికలకు సంబంధించి బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో డివిజన్‌కు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 16న ఎన్నికల సంఘం విడుదల చేయనున్నదని, 16 నుంచి 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పని దినాలలో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. సమావేశంలో బాజిబోయిన వెంకటేష్ నాయుడు (కాంగ్రెస్), సబ్బారపు అప్పారావు (బిఎస్‌పి), జీ.సీహెచ్ సత్యనారాయణ (బిజెపి), ఎం రాజశేఖర్ (సిపిఎం), రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం. జగన్నాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒశ్రీధర్ రెడ్డి

మంత్రి వేణును కలిసిన కుడిపూడి

ప్రజాశక్తి-అమలాపురం

ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణ రావు బుధవారం మంత్రి వేణుగోపాల కృష్ణను రామచంద్రపురంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. జిల్లా నుంచి ఎమ్ఎల్‌సి అభ్యర్థిగా సూర్యనారాయణ పేరు దాదాపు ఖరారు చేసినట్లు లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల సూర్యనారాయణ రావు తాడేపల్లిలో సిఎం జగన్‌ను కలిసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మట్టపర్తి నాగేంద్ర గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేణును సత్కరించిన దృశ్యం

కోటిపల్లి బస్టాండ్‌లో వసతుల కరువు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మహాశివ రాత్రికి కోటిపల్లి పుణ్య క్షేత్రంలో ప్రయాణికులకు బస్టాండ్ లేక పోవడం విశేషం. పదేళ్ల క్రితం ఇక్కడ తూతూ మంత్రంగా ఒక బస్టాండ్ నిర్మించినా దానిలో కనీస వసతులు లేవు. కోటిపల్లి రేవుకు కోనసీమ పరిసర ప్రాంతాల నుంచి ప్రయాణికులు నిత్యం ప్రయాణాలు సాగిస్తారు. దీనితో పాటు ఇక్కడ సోమేశ్వర స్వామి ఆలయం ఉండటం తో యాత్రికులు వస్తుంటారు. నిత్యం ప్రయాణాలు సాగించే యాత్రికులకు ఇక్కడ సరైన బస్టాండ్ సదుపాయం లేక పోవడం విశేషం. నిత్యం ప్రయాణికుల నుంచి టక్కెట్ల రూపంలో ఆదాయం పొందుతున్న ఆర్ టి సి ప్రయాణికులకు బస్టాండ్ నిర్మించ క పోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాల సమయంలో ఒక బస్టాండు నిర్మించినా అది పూర్తిగా పాడై ఆక్రమణలకు గురైంది. బస్టాండ్‌లో కనీస వసతులు లేవు. శివరాత్రికి యాత్రికులు వేలాదిగి గా తరలి వస్తారు. ప్రయాణికులకు బస్టాండ్ నిర్మించి కనీస వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలకు గురైన కోటిపల్లి బస్టాండ్

స్థూపం వద్దనివాళిఅర్పిస్తున్నకారెం వెంకటేశ్వరావు

కోల్‌కత్తాలో వ్యవసాయ కార్మిక సంఘ మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి -అమలాపురం

ఉత్సాహ పూరిత వాతావరణంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10 వ మహాసభలు కోల్‌కత్తా లో బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురునాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లా స్థాయి ఉత్తమ సర్పంచ్ సేవా పురస్కారం స్వీకరించిన గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబును ఆలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి, మోదుకూరు గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ చుండు శ్రీనివాస్, మోదుకూరు సహకార సంఘం మాజీ అధ్యక్షులు రాయుడు సుధాకర్ బుధవారం ఘనంగా సత్కరించారు.

కార్టూ'నిజం'



ఇళ్లకు.. సెల్ ఫోన్లకు స్టిక్కర్లంటించాం సార్.. ఇక ఒంటికి పచ్చబొట్లు వేయించమంటారా..!!

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో రెండు చోట్ల బాధితులకు పలువురు ఆర్థికసాయం అందజేశారు. వివరాలు ఇవి..

ఆలమూరు అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన మడికికి చెందిన జాస్తి బాబూరావు కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్ఎల్ఎ ర్ల జగ్గిరెడ్డి స్థానిక వైసిపి నాయకులతో కలిసి పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.15వేల్ను, 25 కేజీల బియ్యం బుధవారం అందజేశారు. అలాగే ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం నుంచిఅందవలసిన సహాయాన్ని అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. **రాజోలు** క్యాన్సర్‌తో బాధపడుతున్న సోంపల్లికి చెందిన మసకపల్లి అఖిలకు గల్ఫ్ గహ కార్మికుల హెల్పింగ్ హాండ్స్ ఎన్నారై గ్రూప్ సభ్యులు రూ.10 వేలు సాయం బుధవారం అందించారు సంస్థ సెక్రటరీ గంటా శేఖర్ సతీమణి మెర్సీ పుట్టినరోజు సందర్భంగా గ్రూపు అధ్యక్షులు తెన్నేటి ఫిలిం ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో భాగంగా రాజోలులో ఈసాయం అందించారు. ఈనగదును రాజోలు జెడ్‌పిటిసి సభ్యురాలు మట్టా శైలజ, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనవాస్ రావు చేతులమీదుగా అందించారు. అనంతరం మెర్సీ పుట్టినరోజు కేక్‌ను రాజోలు వివేకానంద మానసిక వికలాంగుల కేంద్రంలోబాలల మధ్య కట్ చేసి వారికి బోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విపర్తి సాయిబాబు, రాపాక చిన్ని, డాక్టర్ పాలపర్తి శేఖర్ బాబు, డాక్టర్ తాడి మోహన్ బాబు, నల్లి మోహన్ కుమార్, తెన్నేటి నగేష్, మటపర్తి ప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

మడికిలో అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్ఎల్ఎ చిర్ల

రాజోలులో బాధితురాలికి సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

ద్వారపూడిశివారు ప్రాంతాల్లో ఒరిగిన విద్యుత్‌స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-మండపేట

ద్వారపూడి శివారు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో గ్రావెల్ తరలింపులో భాగంగా స్తంభాల చుట్టూ కొంతమేరైనా గ్రావెల్ ను వదలకుండా తీసివేస్తుండడంతో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పరిశీలిసున్న ఇంజినీర్లు

స్లూయిజ్‌లకు మరమ్మతులు

ప్రజాశక్తి - మామిడికుదురు

శిథిలావస్థలో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతు పనులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఏటా భారీ వర్షాలు, వరదలు సమయంలో మురుగునీరు దిగక రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ హిమాన్షు శుక్లా రూ.21 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో ఆదురులో బచ్చల బంద, వాడబోది, కడలి అవుట్ ఫాల్ స్లూయిజ్‌లకు తాత్కాలిక ఆధునికీకరణ పనులు చేపట్టారు. హెడ్ వర్క్ ఇఇ కాశీ విశ్వేశ్వర రావు, డిఇ శ్రీనివాస్, ఎఇ టిఎల్ఎన్.మూర్తి ఈ మూడు స్లూయిజ్‌లను పరిశీలించారు. కర కట్టపై రోడ్డు ఇరుకుగా ఉండటం, శ్లాబ్ పెచ్చు లు ఊడటం , గోడలు బీటలు వారడం గుర్తించారు. వాటికి ప్రస్తుతం తాత్కాలిక మరమ్మ తులు వల్ల కొంతమేర రైతుల ఇబ్బ ందులు తీరతాయని, కరకట్ట విస్తరణ లో భాగంగా ఇరు కుగా ఉండటంతో పూర్తి స్థాయి లో అధునికీకరించేదుకు ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.

151 మందికి వైద్య పరీక్షలు

పజాశక్తి-కపిలేశ్వరపురం

తాతపూడి గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరంలో బుధవారం 151 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. తాతపూడి గ్రామ సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపిటిసి సభ్యురాలు జిత్తుక వెంకటలక్ష్మి మాట్లాడుతూ పేదలకోసం ప్రభుత్వం ఉచితంగా ప్రవేశపెట్టిన వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగర పిహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ జె. ప్రియాంక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరంలో పలు వ్యాధుల సంబంధించి గ్రామంలోని 151 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ సూపర్ వైజర్ పి.సురేష్, హెల్త్ అసిస్టెంట్లు వి.వెంకటేశ్వర్లు, టి. రామకష్ణరావు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రియాంక

వెంకన్న కల్యాణ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మార్చి 31వ తేదీ నుంచి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఛైర్‌పర్సన్ దూడల విరీతదేవి పేర్కొన్నారు. ఏర్పాట్లపై బుధవారం ఆమె దేవస్థానం సిబ్బందితో కలసి క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష జరిపారు. విరీతదేవి మాట్లాడుతూ మార్చి 31న స్వామివారి కల్యాణంతో ఉత్సవాలు ప్రారంభమతాయన్నారు. మరుసటిరోజు రథోత్సవం, తీర్థం మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఏర్పాట్లపై సిబ్బందితో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. అప్పటికి ఆలయంలో శాలహారం, స్వామివారి కల్యాణం జరిపే కల్యాణమండపం పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. నెలరోజుల ముందు నుంచే ఈ పనులను ప్రారంభించామన్నారు. ఈ సమావేశంలో ఇఒ డి.సాయిబాబు, ట్రస్ట్ బోర్డుసభ్యులు నడింపల్లి వర్మ, దూడల ఫణి తదితరులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ విరీతదేవి

ఆర్చరి పోటీలకు ఎంపికైన అబ్బులను అభినందిస్తున్న తహశీల్దార్ కిశోర్ బాబు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఆలమూరు

రాజమ:హేంద్రవరంలో వల్లా ట్రైనింగ్ సెంటర్ నందు ఈ నెల14న నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి సీనియర్ ఇండియన్ రౌండ్ రిక్వర్ కాంపౌండ్ ఆర్చరీ పోటీలో టి. అబ్బులు గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో విజయవాడలో చెరుకూరి వల్లా అర్చరీ అకాడమీలో ఈనెల 28న జరగనున్న రాష్ట్ర ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు జెఎన్ఎస్.గోపాలకష్ణ, కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారని అబ్బులు విలేకరులకు వెల్లడించారు. బుధవారం గోల్డ్ మెడల్ సాధించిన అబ్బులును స్థానిక ఇన్చార్జి తహశీల్దార్ జెడి.కిషోర్ బాబు, డిటి జానకి రాఘవ, రెవెన్యూ అధికారి రామయమ్మ తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నియోజకవర్గం పరిధిలో కొత్తపేటలో 132 కెవి సబ్‌స్టేషన్ నందు 33 కెవి లైన్ మరమ్మతుల దృష్ట్యా రావులపాలెం, ఈతకోట, ఊబలంక, గోపాలపురం, అత్రేయపురం, పేరవరం సబ్‌స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు.ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావులపాలెం, అత్రేయపురం, కొత్తపేట మండలాల లోని గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. **మండపేట** మండపేట సబ్ డివిజన్ పరిధిలోని ఏడిద గ్రామంలో రథోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండపేట పట్టణం, ద్వారపూడి, ఆలమూరు సెక్షన్ల పరిధిలోని గ్రామాలు, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారుల సహకరించాలని విద్యుత్ శాఖ రామచంద్రపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు.

నరేన్‌కు కేక్ తినిపిస్తున్న దృశ్యం

ఘనంగా నరేన్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి -రామచంద్రపురం

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పండు గోవిందరాజు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర మంత్రి వేణు తనయుడు నరేన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. అదే విధంగా పలువురు రాజకీయ నాయకులు నరేన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోవిందరాజుతో పాటు ఎపిఐడిసి డైరెక్టర్ వాశంసెట్టి శ్యామ్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, ఎంపిపి అంబటి భవాని, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఇళ్ళ సూర్య నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -అయినవిల్లి

ముక్తేశ్వరం వైవిఎస్ బిఆర్ఎం పాలిటెక్నిక్ కళాశాలలో అప్పారి నాగభూషణం మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటును బుధవారం ఎంఇఒ దేవి కనకదుర్గ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని జట్లు ఈ టోర్నమెంట్లో పోటీ పడుతున్నాయన్నారు. ఈ టోర్నమెంట్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వై.కుమారస్వామి, ప్రెసిడెంట్ గుత్తుల మనోహర్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, గుత్తుల నాగబాబు, హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ జెవి.కనకదుర్గ

మహాశివరాత్రికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లా పలుచోట్ల శనివారం మహాశివరాత్రి సందర్భంగా నది పరివాహర ప్రాంతాల్లో పుణ్యసాన్నాలు ఆచరించే వారికి, ఆలయాలు వద్ద యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాలు ఇవి..

అయినవిల్లి అయినవిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మహాశివరాత్రి సందర్భముగా ముక్తేశ్వరం తోగరపాయ నది పరివాహక ప్రాంతంలో పుణ్య స్నానాలు చేసే వారి కోసం చేస్తున్న ఏర్పాట్లను జెడ్‌పిటిపి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి, సర్పంచ్ కాకర శ్రీనివాస్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తాడి శ్రీ వెంకటాచార్యులు, ఇఒపిఆర్‌డి కష్ణ, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** అంగర-పడమరఖండ్రిక ఉయ్యాల జంపాల క్షేత్రం వద్ద మహాశివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి కల్యాణం, తీర్థ మహొూత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఆలయాన్ని రంగురంగులతో సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి రోజైన శనివారం అన్నసమారాధన నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయం వద్ద పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తిరునాతి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

బైకుల చోరీ నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తపేట

వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం పోలీసులు విలేకరులకు వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్‌పి సిహెచ్.సుధీర్ కుమార్ రెడి ఆదేశాల మేరకు కొత్తపేట డిఎస్‌పి కెవి. రమణ ఉత్తర్వుల మేరకు రావులపాలెం సిఐ ఎన్.రజనీకుమార్ ఆధ్వర్యంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస మోటార్ దొంగతనాలకు పాల్పడుతున్న వారిగురించి ప్రత్యేక బందం ఏర్పాటు చేశారు. కొత్తపేట ఎస్ఐ వి.మణి కుమార్, అడిషనల్ ఎస్ఐ శశాంక, వారి సిబ్బంది సహాయం తో వరుస దొంగతనాలు చేస్తున్న చల్లా పవన్ కుమార్, యరంశెట్టి తరుణ్ తేజ, తోరటి శ్రీరామ మూర్తి, గాదం అవినాష్ లను అదుపులోనికి తీసుకుని విచారించారు. వీరు అందరు కోర్టు దగ్గరలో బాబులు కాలనీ, కొత్తపేట గ్రామం, మండలముకు చెందిన వారు. వీరంతా స్నేహితులు. అందరు చెడు వ్యసనలకు లోనై దొంగతనం వత్తిగా చేసుకుని సుమారుగా సంవత్సరం క్రితం నుంచి బైక్ దొంగతనాలు చేస్తున్నారు. వీరు లాక్ చేసివున్న బైక్ లను మారుతాళంతో తీసి అక్కడ నుంచి తీసుకువెళ్లి విక్రయిస్తారు. ఆ సొమ్ముతో జల్సా చేసేవారు. వీరి నుంచి వద్ద, వీరు అమ్మిన వారి వద్ద నుంచి 14 మోటార్ సైకిల్ లు స్వాధీనం చేసుకున్నారు.

మండపేట మోటార్ సైకిల్ చోరీపై పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన పి. బాబురావు పనిమీద ఈ నెల మూడో తేదీన మండపేట పట్టణానికి వచ్చాడు. అనంతరం స్థానిక కపిలేశ్వరపురం రోడ్డులోని కేక్ హౌస్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి లోపలికి వెళ్లి పని ముగించుకుని బయటకు వచ్చేసరికి మోటర్ సైకిల్ కనిపించలేదు. చుట్టుపక్కల అంతా వెతికిన ఫలితం లభించకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి -ఆత్రేయపురం

గుడికి వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటనపై పోలీసు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఈనెల 13న గ్రామంలో ఉన్న శివాలయానికి వెళుతున్నానని తల్లితో చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్క గ్రామాలు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్. సుధాకర్ తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న జిల్లా అధ్యక్షులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -తాళ్లపూడి

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దారు టి.రాధికకు ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అవ్వకముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ సిపిఎస్ రద్దుతో పాటు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘువీర శాస్త్రి, శోభన్ బాబు, రాజు, నాని, శంకరం, నాగరాటాలు రాజారత్నం మూర్తి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పాఠశాలలకు ప్రత్యేకాధికారిగా ఎపిఎం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎపిఎం ఎం.రత్న కుమార్‌ను మండలంలోని చివటం, సత్యవాడ ఉన్నత పాఠశాలలకు ప్రత్యేకాధికారిగా నియమించినట్లు మండల విద్యాశాఖ అధికారి పివిఎస్.నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమన్వయ సమావేశంలో ఎపిఎంను ప్రధానోపాధ్యాయులకు పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, తహశీల్దార్ జి.కనకరాజు, హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, మహిళా పోలీస్, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ట్రిబ్యునల్ సభ్యులు

ప్రజాశక్తి -ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ సభ్యులు, రిటైర్డ్ ఐఎఎస్ పద్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మన్ రమేష్ రాజు, ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

కాకినాడలో పడిన గోల్

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ వందనం సమర్పణ

జాతీయస్థాయి సీనియర్ మహిళా హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

విజయ ఢంకాతో బోణీ చేసిన పంజాబ్, బెంగాల్ జట్లు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆంధ్ర రాష్ట్రంలో తొలిసారి జరుగుతున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా హాకీ చాంపియన్షిప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ముఖ్య అతిథులతో ప్రారంభోత్సవాలు, క్రీడాకారుల నృత్యాలు, ఆట పాటలతో ఎంత ఉత్సాహభరిత వాతావరణంలో తొలి అడుగు పడింది. మొదటి రోజు జరిగిన సీనియర్ హాకీ మహిళా టీమ్‌ల మధ్య ఉత్కంఠ భరి తంగా సాగాయి. ఉదయం జరిగిన మొదటి మ్యాచ్ పంజాబ్, గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా జరిగింది. ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా పంజాబ్ టీమ్ 13 గోల్స్ సాధించి, గుజరాత్‌పై విజయ ఢంకా మోగించింది. తిరిగి 4 గంటలకు ప్రారంభమైన రెండో హాకీ మ్యాచ్ ఉత్తరప్రదేశ్-బెంగాల్ టీమ్‌ల మధ్య ఉత్కంఠగా సాగింది. ఉత్తరప్రదేశ్ టీమ్‌పై బెంగాల్ టీమ్ విజయం సాధించింది.

నేటి మ్యాచ్ వివరాలు

ఉదయం 9 గంటలకు:
మహారాష్ట్ర- పాండిచేరి
మధ్యాహ్నం 3 గంటలకు:
తమిళనాడు- అండమాన్ నికోబార్

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా

తలపడుతున్న బెంగాల్, ఉత్తరప్రదేశ్ జట్లు

హాకీ క్రీడాకారిణుల మార్చ్‌ఫాస్ట్

మహాశివరాత్రి యాత్రా స్పెషల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహా శివరాత్రికి 'యాత్రా స్పెషల్' బస్సులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మహ శివరాత్రి సందర్భంగా 'యాత్రా స్పెషల్' పేరిట ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. డీపీటీవో కార్యాలయంలో బుధవారం డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి యాత్రా స్పెషల్ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులకు ఏర్పాట్లకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. సాధారణ, బస్సులతోపాటు కాకినాడ నుంచి కోటిపల్లి 19, రామచంద్రాపురం నుంచి 10, యానాం నుంచి 6, ఏలేశ్వరం నుంచి రాజమహేంద్రవరం 4, తుని నుంచి పిఠాపురం 4 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. 17, 18 తేదీల్లో కోటిపల్లి, ద్రాక్షారామలో ప్రయాణికుల కొరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేయనున్నామన్నారు. కోటిపల్లిలో కాకినాడ డిపో అధికారులు, ద్రాక్షారామలో రామచంద్రపురం డిపో మేనేజర్ వెంకటేశ్వర రావు, పిఠాపురంలో తుని మేనేజర్ కిరణ్ కుమార్, సామర్లకోటలో ఏలేశ్వరం డిపో మేనేజర్ సత్యనారాయణలు దగ్గరుండి ప్రయాణికులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షిస్తారన్నారు. అదేవిధంగా కాకినాడ నుంచి శ్రీశైలానికి ప్రతిరోజు ఒక సర్వీసును ఏర్పాటు చేశామని, మల్లికార్జునస్వామి దర్శనానికి బస్సు టిక్కెట్‌తోపాటు శ్రీఘ్ర దర్శనం, అతిశ్రీఘ్ర దర్శన టిక్కెట్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపిడిఒ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

బాధితునికి సహాయం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

బాధితునికి జనసేన సహాయం .43వేలు అందజేత

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇటీవల ప్రమాదానికి గురై గాయాల పాలైన సత్యనారాయణకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పంపించిన జనసేన పార్టీ ప్రమాద బీమా చెక్కును రూ. 43వేలను బుధవారం పార్టీ పెద్దాపురం నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సరోజా వాసు, మంచెం సాయి, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగానే ఇంటి నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-మండపేట

పేదల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం ముందుంటుందని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇల్లు కట్టుకుని కోవాలని ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాసు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్ తో కలిసి ఆయన మాట్లాడారు. బ్లాక్ మెయిలర్స్ కు ఎవరూ భయపడవద్దని ప్రతి సామాన్యుడికి తమ ప్రభుత్వం న్యాయం చేసే విధంగా పనిచేస్తుందన్నారు. 25 సంవత్సరాలుగా గాడు సత్యనారాయణ, విలేకరి సయ్యద్ హుస్సేన్ లు ఆర్‌టిఐ చట్టాన్ని ఆసరాగా చేసుకుని పట్టణంలో ఇల్లు కట్టుకునే వారిని తీవ్ర ఇబ్బందులు గురి చేసి వారి వద్ద నుంచి రూ.లక్షలు వసూలు చేశారన్నారు. కొంతమంది మున్సిపల్ సిబ్బంది సహకారంతోనే ఇది జరిగిందన్నారు. ఎవరైనా బాధితులు ఉంటే పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు ఇవ్వవచ్చున్నారు. అంతేకాకుండా స్థానిక గొల్లపుంత కాలనీలో 2000 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇల్లు అప్పగించమన్నారు. అయితే ఇప్పటివరకు 300 లబ్ధిదారులు వచ్చారని మిగిలిన వారు ఎప్పుడు వచ్చినా వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు పాల్గొన్నారు.

రథోత్సవం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

ఏడిదలో బుధవారం నిర్వహ జరగనున్న రథోత్సవం ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, సొసైటి చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఉత్సవ కమీటి చైర్మన్ రామిశెట్టి శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగు రథోత్సవం, రాత్రి 7 గం లకు స్వామి కళ్యాణము, శనివారం మహాశివరాత్రి, తీర్ధము జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, దేవస్థానం గుమస్తా పి.వెంకట్రావు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం ప్రారంభించిన ఆదిత్య సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి

విజయవంతంగా మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విద్యా ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేశారు. .ఆదిత్య సిబ్బంది, విద్యార్థుల సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 2005 నుండి ప్రతీ సంవత్సరం జనవరి, ఆగస్టు నెలల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి జిల్లాలో గల ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించిన బ్లడ్ బ్యాంకు లకు అందిసున్నట్లు తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహణకు గాను అత్యధిక యూనిట్ల రక్తం సేకరించిన ఉత్తమ సంస్థగా గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గవర్నర్ నరసింహన్ నుంచి బంగారు పతకం అందుకున్నట్లు తెలియజేశారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో కాకినాడ, రాజమహేంద్రవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌తో పాటు సిదార్ధ, రోటరీ, ఇండియన్ రెడ్ క్రాస్, విజయశ్రీ, డాక్టర్ వై.ఎస్.ఆర్. జక్కంపూడి రామ్మోహనరావు, ధన్వంతరి రాజమహేంద్రి, రోటరీ బ్లడ్ బ్యాంక్ పెద్దాపురానికి చెందిన ప్రైవేటు సంస్థల డాక్టర్లు శిబిరంలో 819 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్, కె.రవిశంకర్, డి. సతీష్‌కుమార్,. ఎస్.టి .వి.ఎస్.కుమార్, డీన్. జె.డి.వెంకటేష్, డీన్‌లు, విభాగాధిపతులు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్.కో.ఆర్డినేటర్‌లు, రెడ్ క్రాస్ లియో కో.ఆర్డినేటర్లు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్రంగి పనివార్ల ధర్నా

కబ్జాదారు నుంచి సంఘం స్థలాన్ని కాపాడాలని డిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఒకటో వార్డులో వడ్రంగి పనివాళ్ల సంఘానికి కేటాయించిన రెండు సెంట్ల భూమిని స్థానిక ఒకటో వార్డు కౌన్సిలర్ రెడ్డి లావకుమారి భర్త రెడ్డి శ్రీనివాస్ ఆక్రమించి వేరే వ్యక్తికి అమ్మడాన్ని నిరసిస్తూ సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బుధవారం బడ్జెట్ సమావేశం సందర్భంగా లోపలికి వెళుతున్న కమిషనర్, కౌన్సిలర్లకు సమస్యను వివరించి వినతి పత్రాలు అంద జేశారు. అనంతరం వందలాదిమంది కార్మికులు బడ్జెట్ జరుగుతుండగా కౌన్సిల్ సమావేశంలోకి చొచ్చుకుపోయి మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ్ కుమారి మాట్లాడుతూ రెండు రోజుల్లో మీ స్థలం మీకు అప్పగిస్తామని, దానిని కబ్జా ఎవరూ చేయవద్దని, దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, కమిషనర్ కు, కౌన్సిలర్లకు సూచించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ వడ్రంగి పని వారి సంఘాన్ని గుర్తించిన ప్రభుత్వం 2016లో ప్రభుత్వం ఒకటో వార్డులో రెండు సెంట్లు స్థలంలో విరాళాలు వేసుకుని రూ. రెండు లక్షలతో షెడ్లు వేసుకుని. ప్రతినెలా సమావేశాలు నిర్వహించుకుంటున్నా రన్నారు. కరోనా కారణంగా కొద్దికాలం నుండి సమావేశాలు జరపడం లేదని, ఇదే అదునుగా ఒకటో వార్డ్ కౌన్సిలర్ భర్త రెడ్డి శ్రీనివాస్ ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మి వేశారన్నారు. పెద్దాపురం వైసిపి ఇన్చార్జ్ దవులూరు దొరబాబు, మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరిం చకుంటే కాకినాడ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడి స్తామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ రెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వ స్థలాన్ని అమ్మేసిన విషయాన్ని ఎస్‌పి దష్టికి తీసుకెళ్తామని, వెంటనే అతనిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడ కొండ, జిల్లా సహాయ కార్యదర్శి జి.లోవరత్నం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్య నారాయణ, వెలిశెట్టి రామదాసు, కేశవరపు అప్పలరాజు, రామకృష్ణ, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

శిక్షాస్మృతి ఆవిష్కరణపై కేసు నమోదుకు డిమాండ్

ప్రజాశక్తి - ఆలమూరు

బాబాసాహెబ్ అంబేద్కర్ ఎప్పుడో మనుస్మృతిని దగ్ధం చేశారని ఇప్పుడు 'శిక్షాస్మృతి' పేరుతో మనుస్మృతి ప్రాచీన రాజ్యాంగ గ్రంథాన్ని తెలంగాణ రాష్ట్రమైన హైదరాబాద్ తెలుగు యూనివర్శిటీలో ఆవిష్కరించడం రాజ్యాంగ వ్యతిరేకమని మండల దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. శిక్షాస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, రాజద్రోహం కేసులను నమోదు చేయాలని మండల దళిత సంఘాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇంఛార్జ్ తహశీల్దార్ జెడి.కిషోర్ బాబుకు వినతిపత్రం వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దళిత బహుజన ఫ్రంట్ వేమగిరి నరసింహమూర్తి, ఆలమూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెఆర్‌సి.నారాయణ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కె.సునీల్ కుమార్, న్యాయవాదులు సరాకుల సత్యనారాయణ, ఎన్.రాజారావు, కె.ధనరాజు, సిపిఐ కొండే రామకృష్ణ, లంకే యాకోబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలశెట్టి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కడియం

పితృవియోగంతో బాధపడుతున్న కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, ఆయన సోదరులను డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, కడియం ఎంపిడిఒ కె.రత్నకుమారి బుధవారం పరామర్శించారు. తొలుత సత్యనారాయణ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఆకుల విజయ్, బోడపాటి మూర్తి, తోకల శ్రీనివాస్, బోడపాటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విజయరాజు తదితరులున్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిసిసిబి ఛైర్మన్

ట్రై సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలి గ్రామానికి చెందిన బందెల చిన్న వెంకయ్య, చొల్లంగి విష్ణుమూర్తి కి దాతలు సహకారంతో ట్రైసైకిళ్లను బుధవారం ఎంపిడిఒ నాతి బుజ్జి ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద అందజేశారు. దాతల సహకారంతో సమకూర్చిన ట్రై సైకిళ్లను వారికి అందించారు. కార్యక్రమంలో పరిషత్ ఎఒ సురేంద్ర రెడ్డి , జూనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి, గ్రామపంచాయతీ ఒఎస్ జివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న టేకుమూడి ఈశ్వరరావు

ప్రజాశక్తి-పిఠాపురం

వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని విరవ పిహెచ్‌సి కాలనీ కమ్యూనిటీ హాల్లో సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు రుద్రవరపు భూలోకం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్లో వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపిం చారు. దేశంలో 80 కోట్ల మందికి ఆహార సబ్సిడీ సేకరణకు గత బడ్జెట్లో 2, 87, 194 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్లో 1, 97 వేల 350 కోట్లు అంటే దాదాపు 95 వేల కోట్లు ఆహార సబ్సిడీకి తగ్గించారన్నారు. .మరోవైపు వ్యవసాయ కార్మికులను ఉపాధి హామీ చట్టం ద్వారా గత సంవత్సరం 89,400 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం 60 వేల కోట్లు కేటాయించి 30 వేల కోట్లు కోత కోయడం జరిగిందని విమర్శించారు. గత సంవత్సరం ఉపాధి పని చేసిన కూలీలకు 25 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహచలం మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు లేక పెద్ద ఎత్తున వలసలు పోతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఉపాధి నిధులపై కోత వేయడం దుర్మార్గమన్నారు. మున్సిపాలిటీ పట్టణాల్లో పనులు కల్పించాలని, కుటుంబానికి రెండు వందల రోజులు ఉపాధి పనులు కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు 600 వేతనం ఇవ్వాలని ఉపాధి కూలీలందరికీ పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాలదారి రాఘవ, ఉబా బల్లబ్బాయి, మామిడి ఆశీర్వాదం, డెక్కల లాజరు రాగం సత్తిరాజు మేడపాటి చంటిబాబు బి. విజయబాబు పాల్గొన్నారు.

డ్రెయినేజీపై ఆక్రమణల అడ్డగింత

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద మేజర్ డ్రెయిను కి మధ్యలో గుంతలు తవ్వి పిల్లర్లు వేసి ఆక్రమిస్తున్నారన్న సమాచారంతో సామర్లకోటలోని పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు డ్రెయినేజీపై ఆక్రమణ పనులను అడ్డుకున్నారు. సందర్భంగా కౌన్సిలర్లు పాగా సురేష్, కరణం రాజకుమార్, సేపెని సురేష్ సొసైటీ అధ్యక్షులు మేక శ్రీను వైసిపి సీనియర్ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు మాట్లాడుతూ సామర్లకోటలోని ప్రధానంగా గణపతి నగరం, గాంధీ నగర్, సాయి నగర్, భాస్కర్ కాలనీకి చెందిన ఐదు వార్డ్ ల ప్రాంతాలకు చెందిన 8 అడుగుల మేజర్ డ్రెయినేజీని సుమారు 6 అడుగులకు తవ్వి పిల్లర్లు వేయడంతో మురికి నీరు ఆగిపోయే అవకాశం ఉండదని, దీంతో దాని వెనుకన ఉన్న ప్రాంతాలన్నీ డ్రెయినేజీ నీటితో ముంపు పాలవుతాయని అన్నారు అయితే ఈ ఆక్రమణ వెనకాల ప్రముఖ రాజకీయ నాయకుడు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. ప్రస్తుతం మెహర కాంప్లెక్స్ సెంటర్లోని గజం రూ.లక్ష వుంది. ఇటువంటి ప్రాంతంలో సుమారు 30 గజాల ఆర్ అండ్ బి రోడ్డు డ్రెయినేజీని కలిపి ఆక్రమించేందుకు చూస్తున్నారని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి కుమార్ ఘటన స్థలానికి చేరుకున్నారు. పిల్లర్లు వేసేందుకు సిద్ధం చేసిన ఐరన్, సిమ్మెంటు బస్తాలను వైసిపి నాయకులు. మున్సిపల్ అధికారులు బయటకు తరలించి, పిల్లర్లు వేసేందుకు డ్రెయినేజీలో తీసిన గుంతలను మున్సిపల్ అధికారులు దగ్గరుండి మూయించారు. అక్రమ కట్టడాలపై మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులు తక్షణం సంబంధించి పట్టణంలోన ఆక్రమణలను అరికట్టాలని లేకుంటే ప్రజలు తీవ్రంగా ఇబ్బం దులకు గురవుతారని అన్నారు. అయితే ఇటు వంటి ఆక్రమణలన్నీ వైసిపి సీనియర్ నాయకుల అండదండలతోనే జరుగుతున్నా యని ఆరోపణలు కూడా వినపడుతున్నాయి.

డ్రెయినేజీలో పిల్లర్ల నిర్మాణానికి తవ్విన గుంతలను పూడుస్తున్న మున్సిపల్ సిబ్బంది

ధ్వంసమైన రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న వైసీపీ శ్రేణులు

రాజశేఖర్ రెడ్డి విగ్రహం పాక్షికంగా ధ్వంసం

- జె తిమ్మాపురంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-జగ్గంపేట రహదారిలోని జె తిమ్మాపురం గ్రామం వద్ద ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున పాక్షికంగా ధ్వంసం చేయడంతో ఆ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఉదయాన్నే ఈ సంఘటన చూసిన వైసిపి శ్రేణులు ఈ అంశాన్ని జిల్లా నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నియోజక వర్గంలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు వైయస్ విగ్రహం వద్ద రాస్తారోకో, ఆందోళనలు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే డి.ఎస్.పి సుంకర మురళీమోహన్, సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ వి.సురేష్‌ల ఆధ్వర్యంలో క్లూజ్ టీములు, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి పరిశీలన జరిపి విచారణ చేపట్టారు. అప్పటికే అక్కడ ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు 24 గంటల్లో విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అదే రహదారిలో రోడ్ షో పర్యటన ఉండటంతో ఈ సంఘటన రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆందోళన కార్యక్ర మంలో ఆ గ్రామ వైసిపి నాయకులు కుండల ప్రసాద్, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తి బాబు, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, కంటే వీరరాఘవ రావు, కామన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 7 వ తేదీ వరకు, మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు పాఠ్యాంశ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా సమన్వయ కమిటీ పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కమిటీ సభ్యులను బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పరీక్ష రోజున ప్రశ్నపత్రాలను డిపాజిట్ చేయడానికి ఉపసంహరించుకోవడానికి చీఫ్ సూపరింటెండెంట్‌లు, కస్టోడియన్‌లను అనుమతించాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం సెషన్‌లో సమాధాన పత్రాల బండిల్స్‌ను డిపాజిట్ చేయడానికి చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసి వేసే ఏర్పాట్లు చేయాలని జిల్లాలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. పురపాలక సంఘ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి అన్ని పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్య పనులు, క్రిమిసంహారక పనులు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం తోపాటు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యాన్ని పూర్తి స్థాయిలో కల్పించా లన్నారు. ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాల న్నారు. ఆర్టీసీ ప్రాంతీయ మేనేజరు, డిపోల మేనేజర్లు విద్యార్థిని విద్యార్థుల సౌకర్యార్థం నిర్నేత సమయాలకు పరీక్షా కేంద్రాలు చేరుకునేలా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలన్నా రు. పరీక్షలో పైన పేర్కొన్న వాటిని ఖచ్చితంగా అనుసరించాలని ఏవైనా అవాంఛనీయ సంఘటనలు ఉల్లంఘనలు జరిగినట్లయితే తీవ్రంగా పరిగణించడం జరుగు తుందని ఆయన సూచించారు.